ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 14 | సంచిక : 06 | ఫిబ్రవరి 2009

**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(ఫ్రైమ)

**చందా**
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
**రమణ భాస్కర**
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

**ఈ సంచికలో....**

పెన్నాడ ................ 11-11-08
ఏలూరు ............... 01-01-09
జిన్నూరు .............. 04-12-08
అరుణాచలం........ 11-12-08

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-11-08, పెన్నాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అమెరికా ప్రెసిడెంట్‌గా చేసిన రూజ్‌వెల్ట్ ఒక సందర్భంలో నేను గురించి మాట్లాడాడు. ఆయన పొలిటీషియన్ అయినా నేను గురించి అద్భుతంగా మాట్లాడాడు. రూజ్‌వెల్ట్ చెప్పింది ఏమిటి అంటే దేహము నేను అనే భావన అందరికీ ఉంది. ఈ నేను అనేది ఒక తలంపు. నేను అనే తలంపు ఉన్నంతకాలం పునర్జన్మలలో నుండి బయటకు రాలేము. మీరు ఏ దేశీయులైనా, మీరు ఏ కులంలో ఉన్నా, ఏ మతంలో ఉన్నా, ఏ సాధనలు చేస్తున్నా ఈ నేను అనే తలంపు మీకు ఉన్నప్పుడు ఏవో దుర్గుణాలు ఉంటాయి, స్వార్థం ఉంటుంది, పరిమితులు ఉంటాయి, బలహీనతలు ఉంటాయి. దేహము నేను అనే తలంపు ఉన్నంతకాలం వాడు కానిదానితోటి తాదాత్మ్యం పొందటం మానడు. ఒకవేళ వాడు అనుకొన్నా వాస్తవజీవితంలోనికి రాలేడు అని చెప్పాడు. మనం ఎటువంటి భక్తులం అని రూజ్‌వెల్ట్ చెప్పాడు అంటే ఇల్లు విడిచిపెట్ట కూడదు, రోడ్డుమీదకు వెళ్ళాలి. ఈ నేను అనే తలంపును అతిక్రమించాలి అని మనకు లేదు కాని బ్రహ్మజ్ఞానం వచ్చేయాలి అనుకొంటున్నాము, ఇది సాధ్యం కాదు అని చెప్పాడు. ఈ నేను అనే తలంపు ఉన్నంతకాలం హద్దులు, పరిమితులు ఉంటాయి, అది ఉన్నంతకాలం దుఃఖం నిన్ను విడిచిపెట్టదు. నువ్వు ఎన్ని శాస్త్రాలు చదివినా, ఎన్ని సాధనలు చేసినా

ఈ నేను అనే తలంపులోనుండి బయటకు రాలేనప్పుడు ఏమీ ప్రయోజనం లేదు. ఎన్ని మందులు వాడినా రోగం తగ్గనప్పుడు ప్రయోజనం ఏమిటి అలాగే నీవు ఎన్ని సాధనలు చేసినా ఈ నేను అనే తలంపులో నుండి బయటకు రాలేకపోతే యూనివర్సల్ అవ్వలేవు. మీలో ఉన్న ఆ నేనే నేరస్థుడు. మనం ఏది చేసినా దానికోసమే చేస్తాము. నేను అది చేసాను, నేను ఇది చేసాను అనుకొంటూ ఈ నేను పుణ్యాన్ని పోగుచేసుకొంటుంది, పాపాన్ని పోగుచేసుకొంటుంది. నువ్వు పుణ్యఫలితం కావాలి అనుకొంటావు, పాపఫలితం అక్కరలేదు అనుకొంటావు. నీకు బ్రహ్మజ్ఞానం కావాలంటే నువ్వు పాపాన్ని ఎలా విడిచిపెడతావో పుణ్యాన్ని కూడా అలాగ విడిచిపెట్టు. సర్వసాధారణంగా పుణ్యం చేసే వారు పుణ్యఫలితం ఆశిస్తారు దానివలన పుణ్యఫలితం వస్తుంది కాని జ్ఞానం రాదు. ఈ నేను అక్కడకు పరిమితమైపోతుంది.

మీరు ఈశ్వరుడిని హృదయపూర్వకంగా నమ్మితే మీకు శరణాగతి వచ్చేస్తుంది, అశాంతి పోతుంది. కాని మన మనస్సు ఏమి చేస్తుంది అంటే అది ఈశ్వరుడిని నమ్మినట్లు నటిస్తుంది కాని నమ్మదు. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహగతమైననేనులో నుండి బయటకు రాకుండా ఈశ్వరుడి వైపు మీ కళ్ళు తెరువబడవు. బ్రహ్మంను తెలుసుకో అని పరమాత్మ చెప్పాడు. బ్రహ్మం గొప్పది అని మనం అనుకోవటం లేదు. కొంతమంది ధనం గొప్పది అనుకొంటున్నారు, కొంతమంది చదువు గొప్పది అనుకొంటున్నారు, కొంతమంది గౌరవం గొప్పది అనుకొంటున్నారు కాని మీరు అనుకొనేవి ఏమీ గొప్పవికాదు, బ్రహ్మమే గొప్పది. ఆ జైలులో నుండి బయటకు రాకుండా బ్రహ్మం గొప్పది అనే విషయం నీకు తెలియదు. మన అహంభావన కల్పించే విషయాలను ప్రేమిస్తున్నంతకాలం నిజమైనవస్తువును ప్రేమించలేము. అందరి హృదయాలలో నేను అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ గీతలో చెప్పాడు. మన అందరకు తలకాయ గొడవ తప్పించి ఎవరికి హృదయం గొడవ లేదు. మన మనస్సు ఈ తలకాయలో మకాం పెట్టింది. నువ్వు శిరస్సులో బతుకుతున్నంతకాలం నీకు జ్ఞానం ఏమిటి? హృదయంలో బతకటం నేర్చుకో. హృదయంలో బతికేవాడికి కదా స్వర్గరాజ్యం అంటాడు. నీవు హృదయంలో బతుకుతూ ఉంటే లోకంలో 90 గొడవలు జరుగుతున్నా అవి ఏమీ నిన్ను ముట్టుకోవు, వాటి స్పర్శ నీకు తగలదు. హృదయంలో బతుకుతున్నప్పుడు గుణాల ప్రభావం తగ్గిపోతూఉంటుంది. హృదయంలో వాడు అనుభవిస్తున్న

శాంతి వలన, సుఖం వలన గుణాలు వచ్చి వాడిని ముట్టుకొన్నా వాటిమీద ఆకర్షణ కలుగదు, అవి అలా వచ్చి వెళ్ళిపోతూ ఉంటాయి, వాడు గుణాతీతుడు అవుతాడు.

వివేకం, నైపుణ్యం, సామర్థ్యం ఇవి మూడూ చాలా ముఖ్యం అని వ్యాసుడు చెప్పాడు. ఒక పని చెయ్యాలా, చెయ్యకూడదా అని బాగా ఆలోచించి చేసేదే వివేకం. ఆ పని చేయటానికి నిర్ణయించుకొన్నాక ఆ పని ఎలా చేయాలో నేర్చుకోవాలి, అది నైపుణ్యం, ఆ నైపుణ్యం నేర్చుకొన్నా సరిపోదు ఆ పని ముగింపు చేయాలి, ఆ ముగించగల శక్తి నీకు ఉన్నప్పుడు అది సామర్థ్యం. ఇవి మూడు చాలా ముఖ్యం. పక్షి ఎగరటానికి రెండు రెక్కలు ఎలా అవసరమో అలాగే నువ్వు లోపలకు వెళ్ళటానికి వివేకం, వైరాగ్యం రెండూ అవసరం. మనకు ఎంతోకొంత వివేకం ఉంది కాని వైరాగ్యం అసలు లేదు. ఈశ్వరుడు ఉన్నాడు అని మనం అనుకొంటున్నాము కాని ఆయన మీద ఉండవలసినంత విశ్వాసం మనకు లేదు. ఆయన మీద మనకు పూర్తి విశ్వాసం ఉంటే మీ సాధనలతో సంబంధం లేకుండా మనస్సు దానంతట అదే ఆగిపోతుంది. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రాకుండా నీ మనస్సే నీకు అడ్డువస్తోంది. పూర్వజన్మలో చెడ్డకర్మ చేసాము ఇప్పుడు బాధలు అనుభవిస్తున్నాము, పూర్వజన్మలో మంచికర్మలు చేసాము ఇప్పుడు సుఖపడుతున్నాము అని అంటారు. వారు అలా ఏడుస్తున్నారు, వీరు ఇలా ఏడుస్తున్నారు, ఇవన్నీ పిచ్చిమాటలు. మీరు మనస్సులో బతుకుతున్నారు. ఆ మనస్సులో నుండి బయటకు రాలేక ఇలా ఏడుస్తున్నారు. ఈ పుణ్య పాపాలు అన్నీ ఎక్కడ ఉన్నాయి. నీ మనస్సులో ఉన్నాయి. రా అక్కడ నుండి బయటకు రా. నీ మనస్సులో నుండి బయటకు వస్తే ఏమీ లేదు. ఏదో పుణ్యం వస్తుందని, గౌరవం వస్తుందని, మీ పేరు గోడమీద రాస్తారని చెపితేగాని పనులు చెయ్యరు. నీ పేరు మీద నీకు అంత ప్రేమ ఉన్నప్పుడు, అందులో నుండి బయటకు రాలేనప్పుడు ఈశ్వరుడి మీద నీకు ప్రేమ ఎలా కలుగుతుంది. పేరు నువ్వా, నువ్వు కాదు. శరీరం నువ్వా, నువ్వు కాదు. నువ్వు కానిదాని మీద నీకు అంత ప్రేమ ఉన్నప్పుడు, నువ్వు ఏదిగా ఉన్నావో దానిమీద నీకు ప్రేమ ఎలా కలుగుతుంది, కలుగనే కలుగదు, అసలు మనస్సు అటువెళ్ళదు. రూజ్‌వెల్ట్‌కు మనకు తేడా ఏమిటి అంటే వాడు పైకి పొలిటీషియన్ కింద కనిపిస్తున్నా లోపల భక్తి ఉంది. మనం పైకి భక్తుల కింద కనిపిస్తున్నాము గాని లోపల భక్తి లేదు.

మేము లైఫ్‌ను బాగా ఎంజాయ్ చేస్తున్నాము అంటే అలా ఎంజాయ్ చేయటం వలన ఎంజాయ్ చేయాలనే తలంపు పెరిగిపోతూ ఉంటుంది. ఎంజాయ్‌మెంట్‌కు నీకు ఉన్న డబ్బు అంతా ఖర్చుపెడుతున్నావు అనుకో, నువ్వు ఖర్చుపెట్టిన డబ్బు అంతా ఇసుకలో పోసిన నూనెలా ఉంటుంది, ఇసుకలో పోసిన నూనెను బయటకు తీసుకోలేము. ఇతరులకు నువ్వు ఏదైనా అవసరాన్ని బట్టి సహాయం చేస్తే, నువ్వు చేసినది మొత్తం అంతా తిరిగి నీకే వచ్చేస్తుంది. నువ్వు ఇతరులకు ఇచ్చేదంతా తిరిగి నీకే వచ్చేస్తుంది అని తెలిస్తే నువ్వు ఇయ్యకుండా ఎలా ఉండగలవు అన్నారు భగవాన్. మీకు వంద పైసలు స్వార్థం ఉంటే అందులో పది పైసలు తగ్గించుకొన్నా నువ్వు సమాజానికి ఎంతో ఉపయోగపడవచ్చు. నేను ముక్తికోసం తొందరపడటంలేదు, నాకు ముక్తి వచ్చినా రాకపోయినా ముందు ఈశ్వరుని పాదాలయందు భక్తిని అనుగ్రహించండి, అది స్థిరంగా ఉండేటట్లు అనుగ్రహించండి అని భగవాన్‌ను అడిగితే భగవాన్ ఏమన్నారు అంటే ఆ తపన నీకు ఉంటే భక్తి స్థిరపడుతుంది, మీకు నిజంగా భక్తి కుదిరింది అనుకోండి మనస్సు యొక్క చాపల్యం ఆగిపోతుంది, అప్పుడు నీవు మోక్షాన్ని కోరుకోనక్కరలేదు, నీకు యోగ్యత వచ్చినప్పుడు భగవంతుడే మోక్షాన్ని నీకు ప్రసాదిస్తాడు. వివేకానందుడు చదువుకొనే రోజులలో ఎప్పుడైనా రామకృష్ణుడి దగ్గర కూర్చుని నేను ఆ మహాత్ముడిని చూసి వచ్చాను, ఈ మహాత్ముడిని చూసి వచ్చాను అనేవాడు. నువ్వు ఎవరినైతే మహాత్ములు అంటున్నావో వారి అందరికంటే నువ్వే పెద్ద మహాత్ముడివి అది నీకు తెలియటం లేదు అనేవారు రామకృష్ణుడు. కలకత్తాలో అందరూ ఈయనను పిచ్చివాడు అనుకొంటున్నారు, నిజంగా ఈయన పిచ్చివాడే, చదువుకొనే పిల్లవాడిని నన్ను మహాత్ముడు అంటాడు ఏమిటి అని వివేకానందుడు మనస్సులోనే అనుకొనేవాడు. రామకృష్ణ పరమహంస ఏమనేవారు అంటే నువ్వు నన్ను ఎలా అనుకొన్నాఫరవాలేదు, నీ ఇష్టం వచ్చినట్లు అనుకో, వారు ఏదో మంచి పనులు చేసి మహాత్ములు అయ్యారు, నువ్వు పుట్టుకతోనే మహాత్ముడివి అనేవారు అంటే చాలాదూరం చూసేవారు రామకృష్ణుడు.

కొంతమంది జ్ఞానం కోసం అసలు ప్రయత్నం చేయనక్కరలేదు, జ్ఞానమే వచ్చి వారిని వరిస్తుంది. అంటే పూర్వజన్మలోనే వారు పండిపోయి వస్తారు అంటే చేయవలసిన సాధన అంతా పూర్వజన్మలోనే అయిపోతుంది. కర్పూరం హారతిలో పూర్తిగా ఎలా కరిగిపోతుందో

అలాగ ఈశ్వరప్రేమలో, దైవభక్తిలో నీ మనస్సు పూర్తిగా కరిగిపోయేవరకు నువ్వు భక్తిని విడిచిపెట్టకు. ఎప్పడైతే ఈశ్వర భక్తిలో నీ మనస్సు పూర్తిగా కరిగిపోయిందో అప్పడు హృదయగతమైన జీవితం ప్రారంభమవుతుంది, అక్కడ వ్యక్తిగతమైన నేను ఉండదు. నేను కర్మ అనుభవిస్తున్నాను, నేను కర్మ అనుభవిస్తున్నాను అనుకొంటున్నారు, కర్మ అనుభవిస్తున్నాను అని ఏ నేను అయితే చెపుతోందో అందులోనుండి బయటకు రావటానికి నీవు చేసే ప్రయత్నం ఏమిటి? కొంతమంది ప్రయత్నం చేస్తారుగాని సిన్సియారిటీ ఉండదు. మనకు అసలు ఆ ప్రయత్నమే లేదు ఎంతసేపు ఆ నేను చుట్టూ తిరుగుతూ ఉంటాము. ఈ నేను పోతే మనం పోతాము అని చాలామందికి భయం అందుచేత ఆ నేనును పోగొట్టుకోవటానికి ఇష్టపడరు. ఆ నేను పోతే నీవు పోవు, నువ్వు ఎవరో నీకు తెలియబడుతుంది. మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేయటానికి ఏకాగ్రత, పవిత్రత చాలా ముఖ్యం. కాయ ముగ్గి పండు అవ్వటానికి కొంతకాలం చెట్టుని అంటిపెట్టుకొని ఉంటుంది, పండు అయిన వెంటనే ఒక్క క్షణంలో కింద పడిపోతుంది. అలాగే నీ మనస్సు పవిత్రం అవ్వటానికి కొంతటైము పడుతుంది కాని మనస్సు పవిత్రం అయ్యాక హృదయగుహలో పడటానికి కొన్ని క్షణాలలో పడిపోతుంది, అది మీకు తెలియదు, మీకు అందరికీ ఆ ముహూర్తం వస్తుంది కాని అది ఎప్పడు వస్తుందో తెలియదు.

మనస్సులో చెడు అలవాట్లు ఉన్నాయి అనుకోండి వాటిని విడిచిపెట్టమంటే అది విడిచిపెట్టదు, దూడ వట్టిగడ్డి తింటోంది అనుకోండి దానిని వట్టిగడ్డి తినటం మానెయ్యి అంటే మానదు నెమ్మదిగా పచ్చగడ్డి తినటం అలవాటు చేస్తే వట్టిగడ్డి తినటం దానంతట అదే మానేస్తుంది. అలాగే మనస్సును చెడుఅలవాట్లు మానమంటే మానదు దూడకు పచ్చగడ్డి అలవాటు చేసినట్లే మనస్సుకు మంచిగుణాలు, మంచిఅలవాట్లు నేర్పండి, అప్పడు అదే చెడుఅలవాట్లను వదిలేస్తుంది. మంచితనం కూడా గమ్యంకాదుగాని మంచితనం భగవంతుడి పాదాల దగ్గరకు దారి చూపిస్తుంది. లోకానికి సంబంధించిన విషయాలలో అనురక్తి తగ్గించుకో అలాగని సోమరితనంగా ఉండకూడదు. నీ దేహానికి భగవంతుడు ఏ పని అయితే కేటాయించాడో ఆ పనిని నీ పని అనుకోవద్దు, అది భగవంతుడి పని అనుకొని శ్రద్ధగా చెయ్యి. మీ ఇంట్లో ఎవరైనా ముసలివారు ఉన్నారు అనుకో, వారు నీ వాళ్ళు అనుకోవద్దు,

వారు భగవంతుడి వారే అనుకొని ప్రేమగా సేవ చెయ్యి. మనం అనుకొన్నా అనుకోకపోయినా వారు నిజంగా భగవంతుడి వారే. ఎందుచేతనంటే ఆ శరీరం చనిపోతే వారికి మనకు సంబంధం లేదు కాని ఆయనలో ఐక్యమయ్యేవరకు భగవంతుడు వారిని విడిచిపెట్టడు. వైరాగ్యం చాలా రకాలుగా వస్తుంది. మీ ఇంట్లో ఎవరైనా చనిపోయారు అనుకోండి, ఏవైనా కష్టాలు వచ్చాయి అనుకోండి, మీ ఆస్తి సడన్‌గా పోయింది అనుకోండి ఆ రకంగా కూడా వైరాగ్యం రావచ్చు, ఇవి ఏమీ పెర్మనెంట్‌గా ఉండవు. వివేకం వలన వచ్చే వైరాగ్యం మాత్రమే పెర్మనెంట్‌గా ఉంటుంది. ఆ వైరాగ్యం వివేకంలో నుండి పొంగిరావాలి.

ఈమధ్య ఒక సాధువుగారు నాతో ఏమనిచెప్పారు అంటే ఎవరో భక్తులు తీసుకొని వచ్చి ఆయనకు నాలుగు కాసులు బంగారం ఇచ్చారట. అంతకు ముందు బంగారం మొఖం నాకు తెలియదు, అంతకు ముందు రామనామం చేసుకొనేవాడిని. నాలుగు కాసులు వచ్చాక రామనామం వదిలేసాను. కాసు రేటు ఎంత ఉంది, ఎవరిచేత అమ్మించాలి, వచ్చిన డబ్బు ఎలా ఖర్చుపెట్టాలి అని రాముడిని వదిలేసి నా మనస్సు బంగారాన్ని పట్టుకొంది అని చెప్పాడు. ఈ నాలుగు కాసులు పేరు చెప్పి నా భక్తి చెడిపోయింది అని ఇంకో మహాత్ముడి దగ్గరకు వెళ్ళినప్పుడు చెప్పాను ఆయన ఏమన్నారు అంటే ఈ బంగారాన్ని పట్టుకెళ్ళి అమ్మవద్దు, దానిని పేడలో కలిపెయ్యి అని చెప్పారు. అలా పేడలో కలిపేసాక నా మనస్సు కుదురుపడింది అని చెప్పాడు. బంగారం ఇచ్చారు, ఇది అమ్మేస్తే డబ్బు వస్తుంది, దానితో మంచిపనులు చేయవచ్చు అంటే మాయ ఎలా గెంటుకొనిపోతోందో చూడండి. నాకు రామభక్తి పోయింది అన్నాడు పాపం. అంటే దాని వేగం మీకు అర్థమవుతోందా? అంతకు ముందు సుఖంగా ఉన్నాడు. ఒకవేళ బంగారం అమ్మేసి ఏదైనా మంచిపని చేసినా నీ బుద్ధి పాడైపోతుంది అని ఆ మహాత్ముడు చెప్పాడట. ఏదైనా మంచి పని చేసినా అది నేను చేసాను అంటావు, ఎవడికైనా ఇచ్చినా నేను దానం చేసాను అంటావు మొత్తంమీద పాడైపోతావు అందుచేత పేడలో కలపటమే నువ్వు చేయవలసిన పని అని చెప్పాడట.

శరీరం ఎక్కడ ఉంది అనేది ముఖ్యం కాదు. నీ మనస్సులో భగవంతుడితోటి అనుబంధం పెట్టుకోవాలి. నీ మనస్సులో ఈశ్వరుడితో పెట్టుకొన్న అనుబంధం సహజమవ్వాలి. నేను ఈశ్వరుడిని నమ్ముతున్నాను అని నువ్వు అనుకోవటం కాదు, ఆయన అనుకోవాలి.

ఆయన పట్ల ఉన్న ప్రేమ ఎంత దూరం తీసుకొని వెళ్ళాలి అంటే ఆయనా, నేను ఒక్కటే అనే స్థితికి వెళితే అప్పుడు వాడికి అద్వైతానుభవం కలుగుతుంది. జ్ఞాని ఎవరినైనా చూస్తున్నాడు అనుకోండి మీ లోపల ఉన్న నారాయణుని చూస్తాడు గాని మీ శరీరంగాని, మనస్సుగాని, గుణాలుకాని జ్ఞానికి అక్కరలేదు. ఉన్నది నారాయణుడే, అందుచేత అందరిలోను ఆయననే చూస్తాడు. రెండు ఉంటే భయం, రెండు ఉంటే ఇష్టం, అయిష్టం. ఉన్నది ఒక్కటే అయితే ఇష్టం ఏముంది, అయిష్టం ఏముంది, మీ ప్రేమ వలన ఆ స్థితికి రావాలి. మేము ఈశ్వరుడిని బాగా నమ్ముతున్నాము అని మనం అనుకోవచ్చు. మనం అనుకోవటం వలన ప్రయోజనం లేదు, ఆయన అనుకోవాలి. ఆయన ఎప్పుడు అనుకొంటాడు? ఆయన మీద మనకు ఉన్న ప్రేమ నిజమైతే అప్పుడు ఆయన అనుకొంటాడు. మీరు అనుకొనే గొడవలు అన్నీ అబద్ధాలు అంటున్నారు రూజ్‌వెల్ట్. మీరు మంచివారు అనుకొన్నా అబద్ధమే, మీరు చెడ్డవారు అనుకొన్నా అబద్ధమే. ఇవన్నీ ఎవరు అనుకొంటున్నారు, మనస్సు అనుకొంటోంది. ఆ మనస్సులో నుండి బయటకు రావటం నేర్చుకోరు ఏమిటి అంటున్నాడు రూజ్‌వెల్ట్. ఈశ్వరుడి పట్ల ఆరాధన పెరుగుతూ ఉంటే, ఆయనతో మీ మనస్సు సన్నిహితంగా ఉంటే మీకు తెలియకుండా మీ మనస్సు దానంతట అదే ఈశ్వరునికి స్వాధీనమైపోతుంది. ఎప్పుడైతే మీ మనస్సు ఆయనకు స్వాధీనం అయిందో ఈ మనస్సును ఆయన తీసేసుకొని మీకు జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు.

తుకారామ్ చిన్నప్పుడు వ్యాపారం చేసి నష్టాలు తెస్తూ ఉంటే ఇంట్లోవారు కొట్టేవారట. పూర్వం సత్తుబేడలు, సత్తు పావలాలు ఉండేవి, అవి తెచ్చి తుకారామ్‌కి ఇచ్చేవారట. అవి బైట మారవు, తెలివైనవారు ఎవరూ పుచ్చుకోరు. వీడి దగ్గరకు వస్తే అవి తీసుకొని వారికి కావలసిన వస్తువులు ఇచ్చేవాడట. అవి సత్తు బేడలు అని ఆయనకు తెలుసు, ఆయన మంచితనం చూడండి. ఆ సత్తు బేడలు ఆయన తీసుకోకపోతే ఇంకొకరి దగ్గరకు వెళ్ళి వారిని మోసం చేస్తారు, అది ఏదో మనమే మోసపోదాము అనుకొనేవాడట. ఇలా సత్తు బేడలు తీసుకొని ఇంటికివెళితే ఇంట్లోవారు కొట్టేవారట. ఇవి అన్నీ ఎంతో నార్మల్‌గా, సహజంగా అనుభవించాడు, అది తుకారామ్ గొప్పతనం. పెద్ద పెద్ద మహాత్ముల శరీరాలు శవాలు అవుతూ ఉంటే ఈయనను తీసుకొని వెళ్ళటానికి వైకుంఠం నుండి విమానం వచ్చింది. తుకారామ్ యొక్క పుణ్యబలం అటువంటిది. తుకారామ్ ఏమని చెప్పాడు అంటే ఏదో

అహంకారం, అహంకారం అంటున్నారు. శాస్త్రం గురించి నాకు తెలియదు. పాండురంగడు పట్ల భక్తి తప్పించి నాకు ఏమీ తెలియదు. పాండురంగడు పట్ల నాకు ఉన్న ప్రేమప్రవాహంలో నాకు తెలియకుండానే అహంభావన కొట్టుకొనిపోయింది, దానిని పోగొట్టుకోవటానికి నేను ఏమీ ప్రయత్నం చేయలేదు, ఆ ప్రేమ ప్రవాహంలో దానంతట అదే పోయింది అన్నాడు, వాడు తుకారామ్. పాండురంగడుపట్ల ఆయనకు ఉన్న ప్రేమ ప్రవాహంలో మనస్సు నిశ్శేషంగా పోయింది మనస్సు హృదయంలో లీనమవ్వాలి, అది నిజమైన మౌనం. మనస్సు హృదయంలో ఎప్పుడైతే లయమయ్యిందో తనని తాను పోగొట్టుకుంటుంది. బుడగ సముద్రంలో కరిగిపోయింది అనుకోండి బుడగ సముద్రం అవుతుంది. మన మనస్సు అనే బుడగ హృదయంలో కరిగిపోతే అక్కడ ఉన్న చైతన్యం మనకు తానుగా వ్యక్తమవుతుంది. అదే కడసారి జన్మ.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 1-1-09, ఏలూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడు గీతలో భక్తి యోగము, కర్మయోగము, ధ్యానయోగము చాలా యోగాలు చెప్పాడు, మనందరం బ్రాహ్మీస్థితి పొందటంకోసం ఈ యోగాలు అన్నీ చెప్పాడు. అందుచేత వీటిని సమన్వయం చేసుకొని మనం బ్రాహ్మీస్థితిని పొందాలి. బ్రాహ్మీస్థితి పొందేవరకు మనకు సంసారం తప్పదు. ఈ సంసారంలో నుండి, అజ్ఞానంలోనుండి విడుదల అయ్యేవరకు మనకు శాంతి లేదు, సుఖం లేదు, ఏ జన్మకు ఆ జన్మ ఇలా శవాలను మోస్తూ ఉండవలసిందే. భగవంతుడు చెప్పిన మాట మీద మనకు నమ్మకం కుదరటంలేదు. మనకు పుణ్యబలం లేకపోతే ఈశ్వరుడు చెప్పినమాట మీద మనకు విశ్వాసం కలగదు. శ్రద్ధ లేకుండా మనకు జ్ఞానం కలుగదు. భక్తికి మించిన సంపద లేదు. మనం ఎన్ని సంపదలు సంపాదించినా మన శరీరంలో నుండి గాలి బయటకు పోయినప్పుడు వాటితో సంబంధం పోతుంది. మనం పెంచిపోషించుకొన్న భక్తి జన్మాంతరంలో మన కూడా వస్తుంది. అయితే భక్తిని సంపాదించుకోవటానికి మనం ప్రయత్నం చేయటంలేదు ఎందుచేతనంటే దాని విలువ మనకు తెలియటంలేదు. దానికి సంసారం మీద ఉన్న వ్యామోహం కారణం, రాగద్వేషాలు కారణం.

మనం రోజూ సినిమాలు చూస్తూ, టీవీలు చూస్తూ మనస్సును పాడుచేసుకొంటున్నాము. రోజూ టీవీలు చూడటం వలన చెడు తలంపులు వస్తాయి, చెడు ఆలోచనలు వస్తాయి. చెడు ఆలోచనలు వస్తూ ఉంటే చెడ్డ పనులు చెయ్యకుండా ఉండలేము.

మనం శాస్త్రాన్ని అధ్యయనం చేస్తున్నాము కాని, దానిని ఎంతవరకు ఆచరించగలుగుతున్నాము అనేటువంటి విచక్షణ గాని, వివేకంగాని మనకు రావటంలేదు. మీలో కొంతమంది వ్యవసాయదారులు ఉన్నారు, కొంతమంది ఉద్యోగస్తులు ఉన్నారు, కొంతమంది వ్యాపారస్థులు ఉన్నారు, ఇలా ఏదో వృత్తి చేసుకొంటున్నాము. ఈ దేహం ఉన్నంతసేపు ఏదో పని చేసుకోకపోతే శరీరయాత్ర నడవదు. మన శరీరం ఎంత నిజమో, మన మనస్సు ఎంత నిజమో, మనం చేసుకొనే పనులు కూడా అంతే నిజం, ఇది మన గమ్యం కాదు. భగవదనుభవం పొందటమే మన జీవిత గమ్యం, అది మర్చిపోకూడదు. మనస్సుకు ఏకాగ్రత కలుగజెయ్యాలి. ఏకాగ్రత లేకపోతే ఇహం లేదు, పరం లేదు. భగవదనుభవం పొందటానికి ఎంతో క్రమశిక్షణ అవసరం. వారు అలా చేసారు మనం ఎందుకు చేయకూడదు అని అనుకరణ ఉండకూడదు. కేవలం అనుకరణకు అలవాటు పడ్డవారికి, బలహీనులకు, బద్ధకస్తులకు ఆత్మజ్ఞానం కలుగదు. ప్రతీ మనిషికి బయట శత్రువులు ఉంటారు. మన శత్రువులకంటే, ప్రకృతి రీత్యా వచ్చే ఇబ్బందులకంటే మన మనస్సే మనలను ఎక్కువ ఇబ్బంది పెడుతోందని, ఎక్కువ పాడుచేస్తోందని ఇప్పటివరకు మనం గుర్తించలేదు, అసలు ఆ గుర్తింపు మనకు రావటంలేదు. జీవితంలో ఈ విషయం మనందరము మిస్ అయిపోతున్నాము. మన మనస్సు, ఇంద్రియాలు మన స్వాధీనంలో ఉంటే బయట కోటిమంది శత్రువులు ఉన్నా మనలను ఏమీ చేయలేరు.

నియమములన్నింటిలో ఆహార నియమము ఉత్తమమైనది అని భగవాన్ చెప్పారు. మనం మితంగా తినాలి, మితంగా మాట్లాడాలి, వ్యవహారం మితంగా ఉండాలి, ఎందులోను అతి పనికిరాదు. తిండి, శాంతి వీరిద్దరూ మనకు పెద్ద డాక్టర్లు. తిండి అనే పెద్ద డాక్టరును గుర్తుపెట్టుకొంటే మనకు శారీరక ఆరోగ్యం బాగుపడుతుంది, శాంతి అనే పెద్ద డాక్టరును గుర్తుపెట్టుకొంటే మనస్సు బాగుపడుతుంది. మనం ఈ ఇద్దరు డాక్టర్లను మర్చిపోవటం వలన బయట ఉన్న డాక్టర్ల కొంపల చుట్టూ తిరగవలసివస్తోంది. సెల్‌ఫోన్‌లు ఎక్కువగా మాట్లాడటం వలన కూడా మనకు అశాంతి ఎక్కువగా వస్తోంది. పని లేకుండా గంటల

తరబడి మాట్లాడటం మంచిదికాదు, ముఖ్యమైన మాట మాట్లాడి ఫోన్ పెట్టేయాలి. సబ్జక్టు ఏదో చెవులతో వినటంకాదు. చెవులతో ఎవడైతే వినాలో ఈ మాటలు వాడిచేత వినిపింపబడాలి. ఈ శరీరం, మనస్సు మనకు పనిముట్లు, వీటి సహాయంతో మనం భగవదనుభవం పొందాలి. మీరు ఏ దేవుడిని ఆరాధించండి, ఎన్ని మంత్రాలు జపించండి, ఎంత ఉపాసన చెయ్యండి వీటి అన్నింటి యొక్క గమ్యం మన దేహాభిమానం తగ్గాలి. దేహాభిమానం తగ్గితేనేగాని మనకు లోచూపు రాదు. లోచూపు లేకుండా మనకు ఆత్మజ్ఞానం కలుగదు. నాకు మోక్షం వస్తుందా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. నువ్వు పుట్టాను అనుకొంటున్నావా, పుట్టలేదు అనుకొంటున్నావా అని అడిగారు. నేను పుట్టాను అన్నాడు. పుట్టినవాడికి మోక్షం ఏమిటి అన్నారు. నువ్వు ఉన్నావు. గాఢనిద్రలో ఉన్నావు, స్వప్నావస్థలో ఉన్నావు, జాగ్రదవస్థలో ఉన్నావు, శరీరం పుట్టకముందుకూడా ఉన్నావు, శరీరం చనిపోయాకకూడా ఉంటావు. ఉన్నదేదో ఉంది, అదే సత్యం, అదే జ్ఞానం, అదే ఆనందం. సర్వకాల సర్వావస్థలలో ఏదైతే ఉందో అదే ఆనందం, దానికి నీ మనోదేహములతో ఎట్టి సంబంధం లేదు. ఒకడు భగవాన్ దగ్గరకు వచ్చి నేను చెడ్డవాడిని అన్నాడు. గాఢనిద్రలో ఉండగా నేను చెడ్డవాడిని లేకపోతే నేను మంచివాడిని అని నువ్వు అనుకొంటున్నావా అని అడిగారు. అప్పుడు ఏమీ అనుకోవటం లేదు అని చెప్పాడు. ఏమీ అనుకోకుండా ఉన్నప్పుడు అక్కడ నువ్వు ఉన్నావా, లేదా అని అడిగారు. అక్కడ ఉన్నాను అని చెప్పాడు. ఆ ఉన్నవాడే నువ్వు, నేను మంచివాడిని, నేను చెడ్డవాడిని అని ఇలా అనుకొనేవాడు ఈ దేహము ఎంత నిజమో, లోకం ఎంత నిజమో వాడు అంతే నిజం. ఇవన్నీ సాపేక్షిక సత్యాలు.

భగవంతుడు మనలో ఎక్కడైతే అంతర్యామిగా ఉన్నాడో అక్కడకు మనం మేల్కోవాలి, దానికే ఈ సత్సంగ సమావేశాలు, సజ్జన సాంగత్యాలు. మన లోపల ఉన్న సద్వస్తువు ఎంత పవిత్రంగా ఉందో, ఎంత ఏకాగ్రంగా ఉందో మన మనస్సుకు అంత పవిత్రత, ఏకాగ్రత వచ్చేవరకూ మనం ఆ గూటిలో పడము. పైకి ఎగరటంవలన జ్ఞానంరాదు, లోపలకు దిగటం వలన జ్ఞానం వస్తుంది. మనం వినయం నేర్చుకోవాలి, మనకు గౌరవం, సంపద అన్నీ ఉన్నా మనం అణిగి ఉండాలి. అన్నీ ఉన్నా అణిగి ఉన్నవాడికే ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఎగిరి ఎగిరి పడేవాడికి ఆత్మజ్ఞానం కలుగదు. మనం ప్రపంచానికి ఏదైనా సహాయ సహకారములు

చేయగలిగితే చేయవచ్చును. ఆ ఇచ్చేది కూడా మనది కాదు, సొత్తు అంతా స్వామిదే. ఏదో మనం ఇచ్చాము అనుకొంటూ గర్వం పెంచుకొంటున్నాము, దాని వలన మనస్సు పాడైపోతుంది. ఆయనది ఆయనకే ఇస్తున్నాము అనుకొంటే బేధభావం నశిస్తుంది. చేనుకు నీరు పెట్టాక దున్నుతారు. ముందుగా నీరు పెట్టటం ఎందుకు అంటే అది మెత్తపడటం కోసం నీరు పెడతారు. అలాగే నువ్వు స్వార్థం లేకుండా ఇతరుల కోసం పనులు చేస్తూ ఉంటే నీ మనస్సుకు మృదుత్వం వస్తుంది. దయకలవాడు దానం చేయగలడు కాని దయలేనివాడు దానం చేయలేడు. ఒకే నౌకరు ఇద్దరకు పాలేరుతనం చేయలేడు అలాగే నిరంతరం నాకు దైవం కావాలి, ధనం కావాలి అని అంటే అది సాధ్యం కాదు. నిరంతరం నీ మనస్సు ధనం మీద ఉంటే నువ్వు దేవుడిని సమీపించలేవు, దేవుడికి సేవకుడిగా ఉండలేవు. సూది బెజ్జంలో నుండి ఒంటెను లాగగలము గాని ధనవంతుడిని స్వర్గలోకంలోకి పంపలేము అన్నాడు ఏసు. మనకు ధనం అవసరమే కాని మనం ధనానికి బానిసగా ఉండకూడదు.

నిష్కామకర్మ మీరు అనుకొన్నంత తేలికకాదు. రామకృష్ణుడు, మహాత్మాగాంధీ, మదర్ థెరిస్సా లాంటివారు నిష్కామకర్మ చేయగలరు కాని అది అందరకు సాధ్యం కాదు. ఒక్క జ్ఞాని మాత్రమే నిష్కామంగా ఉండగలడు. ఏదో గౌరవం ఆశించి చేసినా, పది మంది ఓట్లు వేస్తారని మనం మంచి పనులు చేసినా అది నిష్కామకర్మకాదు, అది సకామకర్మ అవుతుంది. గౌరవం ఆశించకుండా అక్కడ అవసరాన్ని బట్టి పనులు చేయాలి అంటే పని పనికోసమే చేయాలి. దానం చేయటం వలన మనస్సుకు మృదుత్వం వస్తుంది. మీరు ఎవరికైనా పదిరూపాయలు ఇస్తే దానివలన వాడు ధనవంతుడు అయిపోడు, మీరు పవిత్రులు అవ్వటానికి అది ఒక అవకాశం. శ్రీరాముడి పాలనలో అందరూ ఇచ్చేవారే గాని పుచ్చుకొనేవాడు ఒక్కడూ కనబడే వాడు కాదు. మీరు ఎవరికైనా బియ్యం ఇస్తున్నారు అనుకోండి, వాడు పుచ్చుకొంటే మీరు పుణ్యాత్ములు అవ్వటానికి వాడు మీకు అవకాశం ఇస్తున్నాడు, వాడు వద్దంటే ఎవడికి ఇస్తారు. దానం వేరు, దక్షిణ వేరు. ఎవరైనా ఇబ్బందిపడుతూ ఉంటే, అవసరానికి ఇచ్చేది దానం అంటారు. పెళ్ళిళ్లలో బ్రాహ్మణులకు ఇచ్చేది, పెద్దల పట్ల గౌరవం కొలదీ ఇచ్చే దానిని దక్షిణ అంటారు. మనం చేసే పని చిన్నదా, పెద్దదా అని భగవంతుడు చూడడు. ఆ పని చేసేటప్పుడు ఎటువంటి హృదయంతో చేస్తున్నాము

అనేది భగవంతుడు చూస్తాడు.

మనం ఇతరులకు ఉపకారం చేస్తే ఆ ఉపకారం మనకు తిరిగి వస్తుంది. ఇతరులకు అపకారం చేస్తే అదే తిరిగి మనకు వస్తుంది. మనందరం ఒక్కటే కాని మనకు దేహభావన ఉండటం వలన, మనస్సు ఉండటం వలన వేరు వేరు అనిపిస్తుంది. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. మన శరీరం చనిపోయిన తరువాత కూడా మనం ఉంటాము, ఉండము అని అనుకోవటం వలన భయం వస్తోంది. మన దేహంతోటి, మనస్సుతోటి సంబంధం లేకుండా మన హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది, దాని స్వరూపమే ఉండటం. అది మనకు ఎరుకలోనికి వస్తే దేహం పోయిన తరువాత కూడా మనం ఉంటాము అనే అనుభవం మనకు కలుగుతుంది, అదే అమృతానుభవం. ఇంజనీరింగ్ చదవాలంటే, డాక్టరు కోర్సు చదవాలంటే 5 సంవత్సరాలు కష్టపడి చదవాలి మరి ఆత్మవిద్యను సంపాదించాలంటే ఇంక ఎంత కష్టపడాలి. ఎన్నో జన్మలు నువ్వు కృషి చేస్తేనేగాని నీ స్వరూపం నీకు తెలియబడదు అని పరమాత్మ చెప్పాడు. దేశభక్తి వలన మనస్సు విశాలమవుతుంది, హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. మనం సత్కర్మ నిష్కామంగా చేస్తూ ఉంటే నాకు మోక్షం కావాలి అని మనం అడగనక్కరలేదు, మోక్షం వచ్చి మనలను వరిస్తుంది, భగవంతుడిని మన బుద్ధితో తెలుసుకోలేము. ఆయన మనలను అనుగ్రహించి మనకు ఎరుకలోనికి రావాలిగాని మన బుద్ధి ఆయనను పట్టుకోలేదు. మనకు పాఠాలు నేర్పటానికి ఒకోసారి భగవంతుడు మనలను తలుపు సందున పెట్టినొక్కుతాడు. భగవంతుడు మనలను మొట్టికాయలు మొట్టినప్పడు ఆయనకు మన మీద ఇష్టం లేదు అని అనుకొంటాము గాని మనకు బుద్ధి రావటానికే అలా చేస్తాడు. అది తెలియక భగవంతుడిని పట్టుకొని తిడతాము. మొత్తం జీవకోటిని, జడవస్తువులను, సమస్తసృష్టిని నియమించేవాడు ఒకడు ఉన్నాడు, ఆయనే మనలో అంతర్యామిగా ఉన్నాడు. మనం మాట్లాడేమాటలకు, చేస్తున్న పనులకు సాక్షిగా ఉన్నాడు. మనం నిద్రపోతున్నప్పటికీ, ఆయన మెలుకువగా ఉండి మన నిద్రను చూస్తున్నాడు, ఆయనే పరమాత్మ.

మనకు ఆచార్యులు చాలామంది ఉన్నారు. వారికి సద్వస్తువు యొక్క అనుభవం ఉంది, ఎదురుగా శాస్త్రం ఉంది. శాస్త్రాన్ని, వారి అనుభవాన్ని సమన్వయం చేసి మనకు

భోదిస్తారు. ఆయన ఏ సుఖాన్ని, శాంతిని పొందుతున్నాడో అక్కడకు నిన్ను మేల్కొలపటానికి చూస్తాడు. ఏ అద్వైతానుభవం పొందమని శాస్త్రం మనకు చెపుతోందో అది మనకు అనుభవంలోనికి రావాలికదా, ఆ అనుభవం పొందకుండా మిమ్మల్ని విడిచిపెట్టడు, వాడే ఆచార్యుడు. మనకు ఉండవలసినంత శ్రద్ధ లేదు, మనస్సును బాగుచేసుకోవాలనే బుద్ధి లేదు. ఎంతసేపు మా అత్తగారు ఇలా చేస్తోంది, మా కోడలు ఇలా చేస్తోంది, మా పొరుగువారు ఇలా చేస్తున్నారు అంటున్నారు గాని మీ మనస్సు తీసుకొనివచ్చే క్షోభ, మీ ఇంద్రియాలు తీసుకొని వచ్చే అశాంతి మన శత్రువులు ఎవరూ కూడా తీసుకొనిరాలేరు. ఈ చిన్న విషయాన్ని గ్రహించటానికి నీకు అనేక జన్మలు సరిపోవటం లేదు. అత్తగారి మాటలకు మీరు గాయపడుతూ ఉంటే మీరు కూడా అదే స్థాయిలో ఉన్నట్లు గుర్తు. మీరు కూడా మానసిక పరిధిలో ఉండటం వలన ఆ మాటలకు అశాంతి వస్తోంది. అవమానాలలోను, సన్మానాలలోను ఏమీ లేదు. సన్మానం చేస్తే ఎమోషన్‌వచ్చి, అవమానం చేస్తే డిప్రెషన్ వస్తూ ఉంటే నువ్వు దేహం యొక్క పరిధిని, మానసిక పరిధిని అతిక్రమించలేదు అని అర్థం. జీవితంలో గెలుపు, ఓటమి ఇవన్నీ భగవంతుడి నిర్ణయాన్ని బట్టి వస్తాయి. నువ్వు పని చేయటానికే పనికి వస్తావు, ఫలితం నీ చేతిలో లేదు, ఫలితం నా చేతిలో ఉంది. నీ చేతిలో ఉన్న పని నువ్వు చెయ్యి, నా చేతిలో ఉన్న పని నేను చేస్తాను. కాని నువ్వు ఏమి చేస్తున్నావు అంటే నీ చేతిలో ఉన్న పనిని మానేసి నా చేతిలో ఉన్న పనిని అస్తమాను జ్ఞాపకం చేస్తున్నావు అంటున్నాడు పరమాత్మ.

మనం ఈ రోజు చెడ్డ చేసి ఎస్కేప్ అయిపోయాము అనుకోండి, ఎప్పటికైనా ఎవరు చేసిన కర్మ వారిని ఈ జన్మలోకాకపోయినా రాబోయే జన్మలో అయినా సమాధానం చెప్పేవరకూ వెంటాడితీరుతుంది. ఇక్కడ ఉన్న కోర్టులు దాటివెళ్ళిపోయాము అనుకోండి మరి దేవుడి దగ్గర ఉన్న కోర్టులో ఏమి చెపుతాము అని రాజగోపాలాచారి అన్నారు. ఇక్కడ నుండి కాశీ వెళ్ళిపోతే జ్ఞానం వచ్చేయదు, తెల్లబట్టలు తీసేసి ఎర్రబట్టలు వేసుకొంటే జ్ఞానం వచ్చేయదు, మనం మారుమనస్సు పొందాలి. కడుపు నొప్పి వస్తే తగ్గిపోతే బాగుండును, ఏవైనా కోరికలు ఉంటే అవి తీరిపోతే బాగుండును అనుకొంటున్నారుగాని అసలు మోక్షం పట్ల అపేక్ష ఎవరికి లేదు. సజ్జనసాంగత్యం చేద్దాము అనే తపన ఎవడికి లేదు. మీకు

ఏవైనా బాధలు ఉంటే ఆ బాధలు ఉన్నాయి అని దేవుడికి తెలియదా? దేవుడు కళ్ళు లేకుండా చూడగలడు, చెవులు లేకుండా వినగలడు, చేతులు లేకుండా పని చేయగలడు. భగవంతుడిని ఒక వ్యక్తిగా చూడకూడదు. ఎవడైతే మనకు శుభాన్ని ఇస్తున్నాడో వాడే భగవంతుడు, వాడే ఆనంద స్వరూపుడు, వాడే మనలో అంతర్యామిగా ఉన్నాడు. గెలుపు ఓటములు నీ తెలివి తేటలమీద, నీ డబ్బు మీద ఆధారపడి లేదు. నీ ప్రారబ్దాన్ని బట్టి వస్తాయి. నాకు డబ్బు ఉంది, తెలివి ఉంది అంటే ధనాన్ని బట్టి గెలువవచ్చుకదా మరి డబ్బు ఉన్నవారు ఎందుకు ఓడిపోతున్నారు. అది ఈశ్వరుడిచేతిలో ఉంది. జరుగవలసినది జరిగే తీరును, జరుగరానిది ఎవరెంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు, ఇది నిశ్చయం. మనం భగవంతుడు చెప్పిన మాటలను నమ్మము ఎందుచేతనంటే మనకు పుణ్యబలం లేదు, మనం పెరిగిన వాతావరణం మంచిదికాదు. నేను కాలరూపంలో ఉన్నాను అని భగవంతుడు గీతలో చెప్పాడు. మనం కాలాన్ని గౌరవించాలి. కొన్ని సమస్యలను మనం పరిష్కారం చేయలేము కాలం పరిష్కారం చేస్తుంది.

నేను ఉద్యోగం మానివేస్తాను అని ఒకరు భగవాన్‌తో అంటే ఉద్యోగం మానేస్తే సోమరితనం వస్తుంది. నీ చేతులతో పని చెయ్యి, మనస్సును భగవంతుడి మీద పెట్టు. పనిని నువ్వు విడిచిపెట్టకూడదు, ఒకవేళ పని నిన్ను విడిచిపెట్టేస్తే అభ్యంతరం లేదు. నీ మనస్సును బాగుచేసుకో, మనస్సుకు మెచ్యూరిటీ రావాలి. కొంతమంది మంచివారు కష్టపడుతున్నట్లు, చెడ్డవారు సుఖపడుతున్నట్లు మనకు అనిపిస్తుంది. మనం కేవలం ఈ జన్మలోనివే దృష్టిలో పెట్టుకోకూడదు, పూర్వజన్మ నుండి తెచ్చుకొన్నవి ఉంటాయి. ముందు మనందరికి ఒకటి ఉండాలి. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, మనలను నియమించేవాడు ఒకడు ఉన్నాడు అని పరిపూర్ణమైన విశ్వాసం మనకు ఉండాలి. సన్యసించటం అంటే బట్టలు మార్చుకోవటం, ఇల్లు విడిచి ఎక్కడికో పారిపోవటం కాదు, మన లోపల ఉన్న దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన తగ్గించుకోవాలి. ఎవరిమీదో కోపంతో బుద్ధుడు సన్యాసం తీసుకోలేదు. ప్రేమను, ఆప్యాయతను తన కుటుంబసభ్యులకే గాక సృష్టికి అంతా పంచిపెట్టటానికి ఆయన సన్యాసం పుచ్చుకొన్నాడు. ఈశ్వరుని సంకల్పాన్ని మనం

అంగీకరించలేకపోతున్నాము కాబట్టి మనకు దుఃఖం వస్తోంది. ఆయన సంకల్పాన్ని అంగీకరించే శక్తి మనకు ఉంటే ఇంక దుఃఖం లేదు. మనకు ఏది మంచిదో మనకంటే ఆయనకే ఎక్కువ తెలుసు. అందుచేత ప్రత్యేకంగా అది కావాలి, ఇది కావాలి అని ఆయనను అడగవలసిన పని లేదు. వెంకటేశ్వరస్వామి అడిగిన వారికి అడిగినదే ఇస్తాడట, అడగనివారికి అన్నీ ఇచ్చి మోక్షం కూడా ఇస్తాడు. కాని మనం తిరుపతి వెళితే ఏదో ఒకటి అడగకుండా ఒక్కడూ రాడు. ఏదో ఒకటి అడిగేయటం మోక్షానికి దూరమవ్వటం, ఇప్పుడు జరిగేది ఇది.

భగవంతుడి రూపాన్ని ధ్యానించుకోవటం, ఆయన నామాన్ని స్మరించుకోవటం వలన మనస్సుకు ఏకాగ్రత వస్తుంది. ఏకాగ్రత వచ్చినప్పుడు అక్కరలేని తలంపులు రావు. ఏకాగ్రత వచ్చాక మనస్సు లోపలకు జరగటం ప్రారంభిస్తుంది. మనస్సు ఎప్పుడైతే హృదయంలోనికి జారుతోందో అది కల్పించిన గొడవలు అన్నీ పోతాయి, అప్పుడు హృదయంలో ఉన్న ఆనందం సహస్రారానికి అందుతుంది. మనకు కోరికలతో కనుక భక్తి ఉంటే ఆ కోరికలు నెరవేరతాయి అంతే. నిష్కామ భక్తి వలన హృదయంలో లయమవ్వటానికి మనస్సు ప్రిపేర్ అవుతుంది. నిష్కామకర్మ ఎటువంటిదో, నిష్కామభక్తి కూడా అటువంటిదే. స్వార్థం లేకుండా పని చేయటం నోటితో చెప్పినంత తేలిక కాదు. స్వార్థం లేకుండా పనిచేయటానికి ఎవరైనా అలవాటు పడితే వాడు పరమేశ్వరుని యొక్క అనుగ్రహానికి పాత్రుడవుతాడు, వాడి సంకల్పంతోటి, వాడి కోరికతోటి సంబంధం లేకుండా వాడిని మోక్షంతోటి అలంకరిస్తాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 4-12-08, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు సుబ్రహ్మణ్య షష్ఠి. ఓం స్కందాయ నమః ఇది సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మంత్రం. తమిళనాడులో ఎక్కువగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఆరాధిస్తారు. తమిళనాడులో ఆయనను అందరూ మురుగ, మురుగ అంటారు. మురుగ అంటే అందమైన బిడ్డ, ఆయనే కుమారస్వామి. గణపతి పార్వతి కుమారుడు, సుబ్రహ్మణ్యుడు శివుని కుమారుడు, ఆయన శివుని మూడో నేత్రంలో నుండి వచ్చాడు. సుబ్రహ్మణ్యుడు అంటే బ్రహ్మస్వరూపం ఉన్నది ఉన్నట్లుగా తెలిసినవాడు, ఆయన జ్ఞానగురువు. ఇప్పుడు మనం ద్వైతంలో ఉన్నాము. ద్వైతంలో

ఉన్న మనలను అద్వైతంలోనికి, మృత్యుముఖానికి సిద్ధంగా ఉన్న మనలను అమృతత్వంలోనికి తీసుకొనిపోవటానికి వచ్చిన అవతారమే సుబ్రహ్మణ్యుడు. సనత్‌కుమారుడు బ్రహ్మ మానస పుత్రుడు. సనత్‌కుమారుడికి ఆత్మజ్ఞానం తప్పించి ప్రపంచంలో ఏమీ అక్కరలేదు. మనకు ఆత్మవిద్య కావాలంటే సనత్‌కుమారుడిని ఆశ్రయించాలి. ఒక్క ఆత్మ గురించి తప్ప రెండో గొడవ ప్రస్తావించనివ్వడు. ఆత్మకాని విషయాలు మాట్లాడితే మనలను వెళ్ళి రమ్మంటాడు. వాడు సనత్‌కుమారుడు. నారదుడు సనత్‌కుమారుడిని ఆశ్రయించి ఆత్మవిద్యను నేర్చుకొన్నాడు. సనత్‌కుమారుడు మన వంక చూసినా, మనుషలను చంపేవాడి వంక చూసినా, జంతువుల వంక చూసినా సమస్త జీవకోటిని ఆత్మగానే చూస్తాడు. అందరినీ ఆత్మగానే చూస్తాడు కాబట్టి ఎప్పడూ ఆనందంగానే ఉంటాడు. మనం ఇతరులను చూసేటప్పడు వారు మంచివారు, వీరు చెడ్డవారు అని విభజించేస్తాము. అలా విభజించటం వలన ఒక మనిషిని చూస్తే సంతోషం వస్తుంది, ఒక మనిషిని చూస్తే విరోధం కలుగుతుంది. మనుషులు రకరకాలుగా ఉంటారు. మనం వారిని విభజించుకొని చూడటం వలన చివరకు మనం దుఃఖం తెచ్చుకొంటాము. ఎవడైతే అందరిని ఆత్మగా చూస్తున్నాడో వాడే ఆనందానికి వారసుడు.

మాకు ఇంద్రియాలు ఉన్నాయి, మా ఇష్టం వచ్చినట్లు వాడుకొంటాము అంటే కుదరదు, ఇంద్రియాలను ఒబ్బిడిగా వాడుకోమని సనత్‌కుమారుడు చెప్పాడు. ఇంద్రియాలను ఒబ్బిడిగా వాడుకుంటే మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది, అలా కాకుండా ఇంద్రియాలను ఎక్కువగా వాడుకొంటే, తింగరతనంగా వాడుకొంటే మీరు పూర్వజన్మలో సంపాదించిన పుణ్యం ఉంటే పోతుంది అని చెప్పాడు. ఈ ప్రపంచం మనకు కనిపిస్తోంది, ఎంతవరకు మీరు ప్రపంచాన్ని చూడాలో అంతవరకే చూడాలిగాని అదే పనిగా చూడకూడదు. మీకు చెవులు ఉన్నాయి, చెవులు మూసుకొంటే రోజులు వెళ్ళవు. ఏది మీ జీవిత ధ్యేయమో దాని గురించి, ఆత్మజ్ఞానం గురించి తప్ప ఇంకోటి మీరు వినకూడదు, ఇతర విషయాల గురించి వినేవారితో సహవాసం చెయ్యవద్దు అని చెప్పాడు. మీ శరీరం నిలబడటానికి సరిపడ అన్నం తినాలి కాని నోరు ఉందని ఎక్కువ తినేయవద్దు. కళ్ళు ఉన్నాయని రోజూ సినిమాలు చూస్తే, టివిలు చూస్తే కామక్రోధాలు పెరిగిపోతాయి అని చెప్పాడు. మంచిగుణాలు

నేర్చుకోవటంకంటే, చెడుగుణాలను వదిలించుకోవటం కష్టం అని చెప్పాడు. పది రోజులు కష్టపడితే మంచిగుణం వస్తుంది. పది సంవత్సరాలు కష్టపడి సాధన చేసినా మనలో ఉన్న ఒక్క చెడ్డగుణం పోతుంది అని చెప్పలేము. ఈశ్వరానుగ్రహం లేకుండా ఒకవేళ మీరు ప్రయత్నం చేసినా ఆ గుణం మిమ్మల్ని విడిచిపెట్టదు అని చెప్పాడు. మీరు లెక్కచేస్తున్నారు అనుకోండి, ఆ లెక్క ఎక్కడైనా తప్పు వస్తే తప్పు వచ్చింది అని ఏడుస్తూ కూర్చుంటారా? ఏడుస్తూ కూర్చోరు, ఆ తప్పను సరిచేసుకోవటానికి ప్రయత్నం చేస్తారు. అలాగే మీలో ఏవైనా లోపాలు ఉంటే మాలో ఆ లోపం ఉంది, మాలో ఈలోపం ఉంది అని ఏడుస్తూ కూర్చోవద్దు, ఆ లోపాలను సరిచేసుకోవటానికి ప్రయత్నం చేయండి. మిమ్మల్ని మీరు బాగుచేసుకోవటానికి ప్రయత్నం చెయ్యండి.

ఎవరితో సహవాసం చేయటం వలన మీకు తమోగుణం పెరుగుతోందో, రజోగుణం పెరుగుతోందో అటువంటి వారితో స్నేహాలు ఆపుచేయండి. ఏ ప్రాంతానికి వెళితే మీకు తమోగుణం, రజోగుణం పెరుగుతున్నాయో మొహమాటానికి కూడా అక్కడకు వెళ్లవద్దు. అది ఆపుచేయకుండా మీరు సాధనలు చేసినా ఏమీ ప్రయోజనం లేదు, చిల్లుకుండలో నీరు పోసినట్లుగా ఉంటుంది. డబ్బు ఉన్నప్పుడు గొప్పవాడు అని మనం అనుకొంటాము, బాగా చదువుకొన్నవాడు గొప్పవాడు అని అనుకొంటాము, కాని ఇది సనత్‌కుమారుడు అంగీకరించలేదు. నీకు ఉన్న డబ్బు వలన, నువ్వు చదువుకొన్న చదువు వలన నీ ఇంద్రియాలు, మనస్సు అదుపులోనికి రావు. నీకు ఉన్న డబ్బు వలన, చదువు వలన గర్వం పెరగవచ్చు. క్రమశిక్షణ వలన ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ఏర్పడుతుంది. క్రమశిక్షణ వలన ఆత్మజ్ఞానం పొందటానికి పునాదిపడుతుంది. చదువవలెను, చదువవలెను చావులేని చదువు చదువవలెను అన్నాడు ప్రహ్లాదుడు. ఏ దేశం వెళ్లి చూసినా, ఏ ప్రాంతం వెళ్లి చూసినా, ఎవరి ఇంటికి వెళ్లినా రాగద్వేషములు తప్పించి ఏముంది ఈ లోకంలో అన్నాడు గౌతమబుద్ధుడు. రాగద్వేషాలు ఎప్పుడు వచ్చినాయో వచ్చి మనలో ప్రవేశించాయి, ఇప్పుడు అవి ఉన్నట్లు మనకు తెలుస్తోంది కదా. రాగద్వేషాలను అలాగే వదిలేసి నాకు మోక్షం వచ్చేయాలి, పునర్జన్మ రాకూడదు అంటే పునర్జన్మ రాకుండా ఎలా ఆగుతుంది. రాగద్వేషాలనుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యండి. రాగద్వేషాల నుండి విడుదల

పొందితే అప్పుడు నిర్వాణస్థితిని పొందుతారు.

ఈ లోకంలో కొన్ని భోగాలు ఉన్నాయి, చనిపోయిన తరువాత పరలోకంలో ఈ జీవుడికి కొన్ని భోగాలు ఉంటాయి. సనత్‌కుమారుడు ఏమన్నాడు అంటే ఈ లోకంలో ఉన్న భోగాల మీదగాని, పరలోకంలో ఉన్న భోగాల మీద కాని నీకు కోరిక ఉండకూడదు, వాటి తాలుక తలంపు వస్తూ ఉంటే నీకు మోక్షం రాదు, నీలో ఏ మూలన భోగవాంఛ ఉన్నా మోక్షం వచ్చే సమస్య లేదు అని చెప్పాడు. మనకు అన్నీ కావాలంటే ఎలా వస్తాయి. మనకు లోకంలో గౌరవాలు కావాలి, సన్మానాలు కావాలి, ఇవి అన్నీ కావాలి వీటితోపాటు ఆత్మజ్ఞానం కావాలి అంటే ఎలా కుదురుతుంది, ఇది పొసగదు అంటున్నాడు సనత్‌కుమారుడు. మీకు వెయ్యి ఎకరాల పొలం ఉంది అనుకోండి, ఇది నాది అనే భావన మీకు లేనప్పుడు మీకు వెయ్యి ఎకరాలు ఉన్నా దానివలన మీకు సంతోషం కలగదు. నేను చెప్పానని మీరు నమ్మవద్దు మీరు స్వానుభవంలో చూడండి. నాది అనే భావన లోపల లేదు అనుకోండి మీకు వెయ్యి కోట్లు ఉన్నా సంతోషం రాదు. నాది అనే భావన ఉన్నప్పుడు ఒక ఎకరం ఉన్నా సంతోషం వచ్చేస్తుంది. బయట గొడవల నుండి ఎప్పుడూ సంతోషం తీసుకోకూడదు. నిజంగా మీకు పరిస్థితులు బాగున్నాయి అనుకోండి, ఊరికే తాత్కాలికంగా బాగున్నాయి. పరిస్థితులు బాగున్నా స్వప్నమే, బాగా లేకపోయినా అదీ స్వప్నమే, అదీ కరిగిపోతుంది ఇదీ కరిగిపోతుంది. కల కరిగిపోయిన తరువాత అదంతా అసత్యమని ఎలా తెలుస్తుందో అలాగే మీరు హృదయంలోనికి మేల్కొన్నాక ఇదంతా అసత్యమని మీకు తెలుస్తుంది. మీకు బయట దుఃఖ కారణాలు ఉన్నా దుఃఖ పడకూడదు, సంతోషకారణాలు ఉన్నా సంతోషపడకూడదు. బయట దుఃఖకారణాలు ఉన్నప్పుడు దుఃఖపడి, సంతోషకారణాలు ఉన్నప్పుడు సంతోషపడుతూ ఉంటే కంప్లీట్‌గా ఫెయిల్ అయిపోతాము.

మాయ అంతా మనస్సులోనే ఉంది. మాయ అంతా మనస్సులోనే ఉందని తెలియక ఎక్కడో ఉంది అనుకొంటున్నాము. మీ మనస్సును మీరు బాగుచేసుకొంటే భగవంతుడు మాకు వరం ఇచ్చాడు అనిపిస్తుంది. మీ మనస్సును మీరు పాడుచేసుకొంటే భగవంతుడు మాకు శాపం ఇచ్చాడు, ఇన్ని కష్టాలుపెడుతున్నాడు అనిపిస్తుంది. అది వరం, ఇది శాపం, బయటగొడవలు అన్నీ అసత్యమే. బాహ్యవిషయాల పట్ల మనస్సు ఆకర్షింపబడకుండా, ఆ

విషయాలను దాటి లోపలకు వెళ్ళాలి. బాహ్యవిషయాలు మీ మనస్సును కంగారుపెడుతూ ఉంటాయి. మీరు ధైర్యంగా ఉండవలెను అన్నాడు సనత్‌కుమారుడు. ఏవో గుడులు చుట్టూ తిరగటంవలన, మంత్రాలు జపించటం వలన మనకు భయం పోదు, హృదయాంతరాళాలలో మీకు వైరాగ్యం కనుక ఉంటే మీకు భయం పోతుంది అని చెప్పాడు. ప్రపంచం లేకపోయినా ఉన్నదానివలె కనిపిస్తోంది అని ఆచార్యులవారు చెప్పారు. ఉన్నదాని వలె ఎవరికి కనిపిస్తోంది? నీ మనస్సుకు కనిపిస్తోంది, అది నువ్వు కాదు కదా అంటే చివరకు ఏమీ లేదు. ఈ మనస్సు ఎంత అబద్ధమో ఆ కనిపించేది కూడా అంతే అబద్ధం. చూచేది ఎంత అబద్ధమో చూడబడేది కూడా అంతే అబద్ధం. మీరు ఏదో అనుకోవటం వలన అబద్ధం నిజం ఎలా అవుతుంది. మీరు నిజం అని అనుకొంటే అనుకోవచ్చు కాని అది నిజం కాదు. నిజం మీకు తెలిసేవరకూ మీకు జన్మ రాహిత్యం లేదు. ఏవో మంత్రాల వలన జన్మరాహిత్యం వస్తుంది అని అనుకోవద్దు. మనం ఏదో బోటు పెట్టుకొని బతుకుదాము అనుకొంటే ఆ బోటును లాగేస్తున్నాడు, నిలబడటానికి చోటు లేకుండా చేసేస్తున్నాడు. సముద్రంలో కొంచెం లోపలకు వెళితే కెరటాలు ఉండవు. అలాగే మీ మనస్సును కొంచెం లోపలకు పంపితే, అంటే మీకు అంతర్దృష్టి కలిగితే బయట గొడవలు మిమ్మల్ని వదిలేస్తాయి.

మీ మీద ఎవరైనా ఆధారపడి ఉంటారు అనుకోండి, మేము వారిని పోషిస్తున్నాము, వారు మా మీద ఆధారపడాలి అనుకోవద్దు. అలా మీ మీద ఆధారపడితే మీరు పోతే వారు దిక్కులేనివారు అయిపోతారు అందుచేత వారి కాళ్ళమీద వారు నిలబడే విధానం చూడండి. అంతేకాదు మీరు కూడా ఇతరుల మీద ఆధారపడవద్దు. వారికేదైనా రజోగుణం వస్తే సడన్‌గా మిమ్మల్ని విడిచిపెట్టేస్తారు. కౌరవులు చనిపోవటానికి నువ్వు కారణం కాదు, వాళ్ళ కర్మ వలన వారు చనిపోయారు అని ధర్మరాజుతో భీష్ముడు చెపుతాడు. సనత్‌కుమారుడు అలా చెప్పడు. అసలు నువ్వు ఉంటే కదా? నువ్వు లేవు అంటాడు. అంటే మొత్తానికి గొరిగించి వదిలేయటం. ఒకవేళ నేను ఉన్నాను అనుకొంటే అది కూడా ఒక తలంపే కాని అది నిజం కాదు. మనుషులలో చెడ్డ ఎక్కడ ఉంది అంటే మనకు సమిష్ఠి జీవితం లేదు. సమిష్ఠి జీవితం లేకుండా వ్యక్తిగతంగా మేము గొప్పవారము అయిపోవాలి, మేము గొప్పవారము అయిపోవాలి అనుకొంటున్నారు, అదే దుఃఖానికి కారణం అవుతోంది, వ్యక్తిగత జీవితం వలననే

మనం శాంతికి దూరమవుతున్నాము. పంచదార నీటిలో వేస్తే ఎలా కరిగిపోతుందో అలాగ నీ మనస్సు వెళ్ళి హృదయంలో కరిగిపోవాలి. లోకంలో అనేక ఆకర్షణలు ఉంటాయి. మనస్సు ఏ ఆకర్షణను పట్టుకొని ఉన్నా అది హృదయంలోనికి వెళ్ళదు. మనస్సు వెళ్ళి హృదయంలో లయించాలి, అప్పుడుగాని మనకు జ్ఞానం రాదు. నాకు ఎప్పుడైనా ఆనందం కలుగుతోంది, ఆనందం వచ్చినప్పుడు పొంగిపోతున్నాను, ఆనందం తగ్గినప్పుడు కృంగిపోతున్నాను అని భగవాన్‌తో ఒక భక్తుడు చెపుతున్నాడు. భగవాన్ ఏమంటున్నారు అంటే నాకు ఆనందం కలిగింది అంటున్నావు. ఆనందం కలిగినప్పుడు అక్కడ నేను ఉంది, ఆనందం పోయినప్పుడు నేను ఉంది. ఆ నేను ఉన్నంతసేపు ఏది వచ్చినా వస్తూ ఉంటుంది, పోతూ ఉంటుంది. ఆ నేను ఎవరో తెలుసుకొంటేనేగాని ఆనందం స్థిరపడదు అని చెప్పారు.

మీకు ఏదైనా ఆలోచన వస్తోంది అనుకోండి, మీకు ఏదైనా తలంపు వస్తోంది అనుకోండి, వీటి అన్నింటికి దేహమే కేంద్రం అవుతుంది. దేహము నేను అనే భావనలో నుండే మీకు సంకల్పాలు వస్తాయి, వికల్పాలు వస్తాయి, భయం వస్తుంది, క్రోధం వస్తుంది, అన్నీ వస్తాయి. అందుచేత భగవాన్ ఏమి చెప్పారు అంటే దేహము నేను అనే తలంపు ఉంటే అన్నీ ఉన్నాయి అది లేకపోతే ఏదీ లేదు అన్నారు. దానిని పోగొట్టుకోకుండా మీరు ఎన్ని పూజలు చేసినా, జపాలు చేసినా, సాధనలు చేసినా మీకు పునర్జన్మ లేని స్థితి రాదు. మీరు మంచిపనులు చేయటం వలన పుణ్యం రావచ్చు, పుణ్యాన్ని మీరు అనుభవించవచ్చు, దానికి జ్ఞానానికి సంబంధం లేదు. జ్ఞానం మీద ఎప్పుడైనా మీరు గురిపెడితే కదా. దానిని పొందాలనే ఆసక్తి అసలు మీకు లేదు. జ్ఞాన సముపార్జన చేయాలనే తలంపు మనకు ఎందుకు రావటంలేదు అంటే దాని విలువ మనకు తెలియటం లేదు. నీవు నీవుగా ఉన్నప్పుడు నీకు భిన్నంగా ఏదీ కనబడదు. నీవు నీవుగా ఉండలేకపోతున్నావు అనుకో అన్నీ నీకు భిన్నంగా కనిపిస్తాయి, అప్పుడు భయం నిన్ను వెంటాడుతుంది. రాగద్వేషములు తప్ప జీవుడికి ఇంకో పనిలేదు. గడియారం ముల్లు తిరిగినట్లు ఇష్టం, అయిష్టం ఈ రెండింటి మధ్య మనస్సు తిరుగుతూ ఉంటుంది, ఇంక మనస్సు లోపలకు ఎలా వెళుతుంది. ఇష్టాలు, అయిష్టాలు మనలో ఉన్నప్పుడు మనస్సు పైకి తేలిపోతూ ఉంటుంది. సనత్‌కుమారుడికి ఇష్టం లేదు, అయిష్టం లేదు. అందరినీ ఆత్మగానే చూస్తాడు. అందరినీ ఆత్మగానే చూసేటప్పుడు ఇంక

ఇష్టం ఏమిటి? అయిష్టం ఏమిటి? సనత్‌కుమారుడు ఏమి చెప్పాడు అంటే మీకు వెయ్యికోట్లు ఉంటే ఆనందం రాదు, వంద పిహెచ్‌డిలు ఉంటే ఆనందం రాదు. మీరు అందరినీ ఆత్మగా చూడటం నేర్చుకొంటే మీరు ఆనందంగా ఉంటారు. సమాజంలో రకరకాల మనుషులు ఉంటారు, వారి గుణాలు రకరకాలుగా ఉంటాయి. ఆ గొడవ నీకు ఎందుకు? ఆ గుణాలు కూడా వారు కాదు. ఆ గొడవలు అన్నీ వదిలేసి అందరినీ ఆత్మదృష్టితో చూడండి, అప్పుడు మీకు ఆనందం కలుగుతుంది, శాంతి కలుగుతుంది.

ప్రతి జన్మలోను మనం కాని గొడవలను మనం చుట్టబెట్టుకొని వస్తూ ఉంటాము. మీరు విచారణ చేస్తే మిమ్మల్ని అంటిపెట్టుకొని ఉన్న గొడవలు, మిమ్మల్ని చుట్టుకొన్న గొడవలు, గత జన్మల నుండి మీరు నొల్లి తెచ్చుకొన్న గొడవలు అన్నీ వాటంతట అవే ఊడిపోతాయి, ఎందుచేతనంటే అవి నిజం కాదు కాబట్టి అవి అన్నీ ఊడిపోతాయి. సనత్ కుమారుడు ఏమని చెప్పాడు అంటే మనం శత్రువులను శత్రువులుగా చూస్తాము, మిత్రులను మిత్రులుగా చూస్తాము. కాని ఒక శత్రువును మీరు నిజంగా మిత్రుడిగా చూడగలుగుతున్నారు అనుకోండి అది ఈశ్వరుని దయ లేకుండా మీ తెలివితేటల వలన సాధ్యం కాదు అని చెప్పాడు. ఇంద్రియాలు అన్నింటిని ఒబ్బిడిగా వాడుకోండి. ఇంద్రియాలను ఒబ్బిడిగా వాడుకోకపోతే విచ్చలవిడితనం వచ్చేసి క్రమశిక్షణ పోతుంది. క్రమశిక్షణ పోయిన తరువాత మీ చదువుగాని, మీ ధనంకాని మిమ్మల్ని రక్షించలేదు, అది సనత్‌కుమారుని బోధ. సృష్టి అంటే ఏమీ లేదు కామక్రోధాలే సృష్టి. మనలో కామక్రోధాలు ఉన్నంతకాలం ప్రపంచంలోనికి రాకుండా ఉండటం సాధ్యం కాదు అంటున్నాడు సనత్‌కుమారుడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-12-08, అరుణాచలం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ప్రతీ మనిషి ఏ పని చేసినా సంతృప్తికోసం చేస్తాడు. అందరూ వారి ఇంట్లో వారిని వారు ప్రేమించుకొంటున్నారు. మమ్మల్ని కూడా అలా ప్రేమించమంటే ఎవరూ ప్రేమించరు. మీ ఇంట్లో వారిని మీరు ప్రేమించుకోవటం వలన మీకు సంతృప్తి వస్తోంది. అందుచేత వారిని ప్రేమిస్తున్నారు. మమ్మల్ని ఎందుకు ప్రేమించరు అంటే మామీద కోపంలేదు, మమ్మల్ని

ప్రేమించినప్పుడు మీకు సంతృప్తి రావటం లేదు. మీకు సంతృప్తి రానప్పుడు మమ్మల్ని ప్రేమించండి అని అడిగినా మమ్మల్ని మీరు ప్రేమించరు. మనిషి కేవలం అన్నం తినటం వలన బట్టలు కట్టుకోవటం వలన బతకలేడు, జీవితానికి ఒక సంతృప్తి ఉండాలి. మనం స్మశానానికి వెళ్ళేవరకు ఇంద్రియాలను ఎలా సంతృప్తి పరచుకొందామా అని ఆలోచిస్తాము కాని ఆత్మజ్ఞానం గురించి ఆలోచించము. ఆత్మజ్ఞానం వస్తుందో రాదో వదిలేయండి అసలు దానికోసం ప్రయత్నం చేయము. ఎవరి శరీరం చూసుకొని వారు పొంగిపోతున్నారు. అసలు శరీరం ధరించటమే అశుద్ధంతోటి సమానం అని ఒక శివభక్తుడు చెప్పాడు. మన శరీరానికి ఇచ్చే ప్రాముఖ్యత మన మనస్సుకు ఇవ్వటంలేదు. ఎందుచేతనంటే మనస్సు విలువ మనకు తెలియటం లేదు. మన మీద దుమ్ముపడితే దులిపేసుకోవాలి అని అనుకుంటాము. మరి మనస్సులో పడే దుమ్ముకూడా దులుపుకోవాలనే బుద్ధి మనకి రావటం లేదు. మనం ఎప్పుడూ సత్కర్మ చేయకపోవటం వలన ఆ బుద్ధి మనకు కలగటం లేదు. కళ్ళజోడు శుభ్రంగా లేకపోతే గుడ్డపెట్టి శుభ్రంగా తుడుచుకుంటూ ఉంటాము. అద్దాలు శుభ్రంగా లేకపోతే మీరు ఉన్నా మాకు కనబడరు. పుస్తకం చదివినా పుస్తకంలో అక్షరాలు కనబడవు. అలాగే బుద్ధిలో దుమ్ముపడకుండా ఉంటే, బుద్ధి నిర్మలంగా, నిశ్చలంగా ఉంటే అప్పుడు భగవద్గీత అర్ధమవుతుంది. నీ బుద్ధి సరిగ్గా లేనప్పుడు ఏదో కాలక్షేపంకోసం భగవద్గీత చదివినా ఆ భగవద్గీత తన హృదయాన్ని ఇవ్వదు. మీలో చాలామంది మేము బుద్ధిమంతలము అని అనుకుంటున్నారు. కొంతమంది మేము చాలా తెలివిగలవాళ్ళము అందరిని ఉద్దరిస్తున్నాము అని అనుకుంటున్నారు. అసలు సబ్జక్టు ఏమిటి అంటే ఈ తెలివి గలవాళ్ళు, ఈ పండితులు, మంచివాళ్ళు అనుకోవటం ఇదంతా మాయలో ఉండటం వలన అనుకుంటున్నారు. మాయ దాటిన తరువాత ఇలా అనుకోము. ఇలా అనుకుంటున్నాము అంటే మనం నూటికి నూరుపాళ్ళు మాయలో వున్నాము అని అర్ధం.

ప్రపంచంలో ఉన్న మాయ అంతా ధనరూపంలో ఉంది అని వాల్మీకి చెప్పాడు. ధనం దగ్గరకి వచ్చేటప్పటికి అక్కాచెల్లెళ్ళు పేచీ పెట్టుకుంటారు, అన్నదమ్ములు పేచీలు పెట్టుకొంటారు, కోర్టుకి వెళ్ళిపోతారు. భగవంతుడు ఏమి చేసాడంటే చిల్లర చిల్లరగా పెట్టటం ఇష్టంలేక మాయ అంతా ధనంలో పెట్టి వదిలేసాడు అని వాల్మీకి చెప్పాడు. సబ్జక్టు ప్రోపర్‌గా అర్ధం

చేసుకోకుండా ఏదో వచ్చేస్తుంది అనుకుంటే ఏమి వస్తుంది? దుమ్ము వస్తుంది తప్పించి ఇంక ఏమీ లేదు. భగవంతుడు చెప్పిన వాక్యము ఉన్నది ఉన్నట్లుగా మీకు అవగాహన అవ్వాలి. మనకు ఉంటే కోరిక ఉంటుంది లేకపోతే కోపం ఉంటుంది. మనకి ఏ రకమైన కోరిక వచ్చినా అక్కడ అజ్ఞానం ఉంటుంది. అజ్ఞానం ఉంటేనే మనకి కోరిక వస్తుంది. నీకు రాంగ్‌తింకింగ్ లేకపోతే అసలు డిస్ట్రబెన్స్ రాదు. రాంగ్‌తింకింగ్ ఉందని మనకి తెలుస్తోంది కాని దానిని రైట్‌తింకింగ్‌లోకి మార్చుకోవటానికి సాధన లేదు అసలు ఆ ప్రయత్నమే లేదు, నువ్వుకాని సమాజంతోటి, నువ్వుకాని శరీరంతోటి, నువ్వు కాని మనస్సుతోటి తాదాత్మ్యం పొందినంతకాలం కోటి జన్మలు ఎత్తినా నిన్ను భయం వెంటాడుతూ ఉంటుంది. మీకు వెయ్యి కోట్ల డబ్బు ఉన్నా మీ కూడా భయం వచ్చేస్తూ ఉంటుంది. జనరల్‌గా మనుషుల్ని చూస్తూ ఉంటే నూటికి ఒకరో ఇద్దరో శాంతిగా ఉంటారు. మిగతా వాళ్ళందరూ అశాంతితోటి బాధపడుతూ ఉంటారు. డబ్బు ఉన్నవారికి అదే పని, డబ్బు లేనివారికి అదే పని. బయట ఏదో ఉంది, ఏదో పొందాలి అని ఎవడి మొఖం చూసినా అశాంతే. మన దేహంతోటి, మనస్సుతోటి తాదాత్మ్యం ఎంతకాలమైతే మనకి ఉందో అంతకాలం బంధువులు ఉంటారు, స్నేహితులు ఉంటారు, విరోధులు ఉంటారు, బంధువులు అంటేనే బంధించేవాళ్ళు అని అర్థం. మా చుట్టాలు, మా చుట్టాలు అని అలా చెప్పుకుని తిరుగుతూ ఉంటాము అదొక సంతృప్తి.

మీరు కాలేజీల్లో చదివే చదువుల వల్ల పొట్ట వెళ్ళిపోతుంది కాని దాని వలన శాంతి రాదు, జ్ఞానం రాదు. చదువు వలన మనకి గర్వం వస్తోందికాని వినయం రావటంలేదు. అంటే ఆ చదువులో, ఆ పద్ధతిలో ఎక్కడో లోపం ఉంది. నీకు విద్య వచ్చి వినయం రాకపోతే వింత పశువు అవుతావు అని భర్తృహరి చెప్పాడు. మీ శరీరం కూడా నీడ ఎలా వస్తుందో అలాగ విద్యకూడా వినయం వచ్చేయాలి. మీరు చదువుకున్న చదువు నిజమైతే మీరు అణిగి ఉంటారు. కాని మీరు ఎగిరి ఎగిరి పడుతున్నారంటే మీరు చదివింది మీకు అర్థమవ్వలేదు. రాగద్వేషాలు లేని మనిషిని చూసేకొలది చూడాలని అనిపిస్తుంది. అది లోపల ఉన్న జ్ఞానం యొక్క వైభవం. మనం ఒక పండుని పట్టుకున్నాము అనుకోండి ఆ పండు వదిలేస్తే భూమియొక్క ఆకర్షణ వల్ల కిందకి పడిపోతుంది. అలాగే రాగద్వేషాలు మనస్సుని వదిలేసాయి అనుకోండి మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది. సొత్తుగలవాడు

స్వామి. మనందరం నేను నేను అంటాము. నేను ఎవడో మీకు తెలియకపోయినా వాడిని వేసుకొని తిరుగుతున్నాము కదా! ఇది ఎవరి సొమ్ము? ఏ హృదయంలో అయితే ఈశ్వరుడు ఉన్నాడో, ఎక్కడైతే భగవంతుడు అంతర్యామిగా ఉన్నాడో అక్కడ నుంచే ఈ నేను వచ్చింది. అందుచేత ఇది దేవుడు సొమ్ము. వాడిది వాడికి ఇచ్చేయాలి. ఈ నేనును దేవుడు దగ్గరకి పంపేస్తే నేను పీడ విరగడ అయిపోతుంది, ఈ నేనును వాడి దగ్గరకు పంపటం మనకు చేతకావటం లేదు. వాడిని లోపలకి వెళ్ళిపొమంటే ఎగిరి ఎగిరి బయిటకి వచ్చేస్తున్నాడు. అలవాట్ల వేగం వాడిని బయటికి తీసుకువచ్చేస్తుంది. అహంకారాన్ని సంతృప్తి పరచుకోవటానికి పనిచేయమని చెప్పలేదు, చిత్తశుద్ధి కోసం పని చేయమని పరమాత్మ చెప్పాడు. కాని మనలను అహంకారం సంతృప్తి అయితే పని చేస్తాము. లేకపోతే ఆ పని చెయ్యము, దేవుడు చెయ్యమన్నా చెయ్యము.

మీరు సరస్వతీ దేవి పుత్రులు అని ఆచార్యులవారితో అంటే ఆయన సంతోషించలేదు. భక్తికి మించిన సరస్వతి ఉందా, భక్తికి మించిన లక్ష్మి ఉందా, భక్తికి మించిన పార్వతి ఉందా, భక్తికి మించిన సొమ్ము ఉందా అన్నారు ఆచార్యులవారు. సద్భక్తు తాలుక అనుభవం చేతిలో పెట్టుకొని ఆ అనుభవాన్ని చిన్న చిన్న మాటలతోటి ఇతరులకు అర్థమయ్యేలాగ చెప్పేవారు, ఆ నేర్పు ఆచార్యులవారికి ఉంది. మీరు కోరికలతోటి భక్తిగా ఉంటే మీకున్న కోరిక నెరవేరుతుంది కాని దేవుని అనుగ్రహానికి పాత్రులుకారు. ఏదో లోకవిషయాలకోసం, భోగాలకోసం, అక్కడ ఏదో ఉంది అని దానిని పొందటం కోసం భగవంతుడిని ప్రార్థిస్తే అది భక్తి కాదు అని ఆచార్యులవారు చెప్పారు. భగవంతుడిని భగవంతుడికోసమే మనం ప్రార్థిస్తూ ఉంటే అది భక్తి అన్నారు. మనం మనుషుల్ని మోసం చేయగలము కాని దేవుడిని మోసం చేయలేము. ఈశ్వరుడు దయా సముద్రుడు, కర్మఫలదాత. మీరు చేసిన కర్మకి ఫలితం ఇవ్వకుండా ఉండడు. కర్మ ఫలితం అనుభవించేటప్పుడు వాడిని తిట్టుకుంటాము. తిట్టుకున్నా వాడు దయా సముద్రుడే. మీకు పడవలసిన మొట్టికాయలు మీకు పడితేనేగాని బుద్ధిరాదని వాడికి తెలుసు. మనం వినము కాబట్టి మనకి కర్మఫలాన్ని ఇచ్చి దెబ్బలు కొడుతూ ఉంటాడు. మనకి ఆ దెబ్బలు కొట్టినా బుద్ధి రావటంలేదు. మనం బొత్తిగా మొద్దుబారిపోయాము. సంకెళ్ళు అనేవి బయట ఎక్కడా లేవు. మన కోరికలే మన సంకెలు

ళ్ళ మన తలంపులే మన సంకెళ్ళు, మన సంకల్పాలే మన సంకెళ్ళు అందుచేత సాధ్యమైనంతవరకు కోరికలు తగ్గించుకోవాలి. అలవాట్లు వేగం తొందరగా తగ్గదు. మీరు ప్రయత్నం చేయాలి, ఈశ్వరానుగ్రహం ఉండాలి. అసలు మనం ఈశ్వరుడిని స్మరించాలన్నా ఆయన అనుగ్రహం లేకుండా ఆయనను స్మరించలేము. మీరు ప్రయత్నం చేయాలి. మీ ప్రయత్నం ఫలిస్తుందా లేదా అన్నది ఈశ్వరుడి యొక్క చేతిలో ఉంది. నీ చేతిలో ఉన్న పనిని నువ్వు చేసి వదిలేయి.

మన మాట దేవుడు చూడడు, మనం చేతితోటి చేసేపని దేవుడు చూడడు. లోపల ఉన్నటువంటి సంకల్పాన్ని చూస్తాడు. దానిని బట్టి నీకు చిత్తశుద్ధి కలుగుతుంది కాని బయట మనం చేసే కుయుక్తులవల్ల, కుతంత్రాల వల్ల, జిమ్మిక్కుల వల్ల మనకు జ్ఞానం రాదు. నీ మనస్సుని నువ్వు బాగుచేసుకోవాలనే బుద్ధి కూడా నీకు కలగటం లేదు. నీ శరీరం చనిపోయాక నీ కూడా మనస్సు తప్పించి ఏదీ రాదు. అందుచేత మీకు గురువుతోటి, ఈశ్వరుడుతోటి మానసికమైన అనుబంధం ఉండాలి. మీ శరీరం ఎక్కడ ఉన్నా భగవంతుడితోటి మానసిక అనుబంధం ఉండాలి. భగవంతుడే మనకు తల్లి, భగవంతుడే మనకు తండ్రి. భగవంతుడు మన క్షేమం కోరినట్లు సృష్టిలో ఎవరూ కోరరు అనే విషయం మరచి భగవంతుడిని మిస్ అయిపోతున్నాము. మనం బాగా డబ్బు సంపాదిస్తే, ఇంటినిండా సామాన్లు పెట్టేసుకొంటే, బాగా చదువుకుంటే మనం సుఖంగా ఉండగలము, శాంతిగా ఉండగలము అనుకుంటున్నాము ఇది తప్పడు అభిప్రాయము. ఇందులో నుండి బయటకు రావటానికి వెయ్యి జన్మలు పట్టినా ఆశ్చర్యపడ నక్కరలేదు. ఎందుచేతనంటే శాస్త్రం మంచి విషయం చెప్పినా నీ బుద్ధిలో కల్మషం ఉన్నప్పడు ఆ మంచిని నమ్మనివ్వదు, మనం నిజంకంటే అబద్దాన్ని ఎక్కువ ఇష్టపడతాము, ఎందుచేతనంటే మన మనస్సు అబద్ధం.

మనం ఎవరికైనా ఒక పదార్థం ఇస్తున్నాము అనుకోండి లేకపోతే అన్నము పెడుతున్నాము అనుకోండి అక్కడ పెట్టటం ప్రధానం కాదు, అక్కడ మన సంకల్పం ఎలా ఉంది, ఏ ఉద్దేశ్యంతోటి ఇస్తున్నాము అది ప్రధానం. కుచేలుడు కృష్ణుడికి వాసన వచ్చిన అటుకులు ఇస్తాడు. ఆ వాసన వచ్చిన అటుకులు ఎంత గొప్పగా ఉన్నాయి అంటాడు కృష్ణుడు, అంటే అక్కడ కుచేలుడు యొక్క భక్తిని చూస్తున్నాడు కాని అటుకులు తినటంకాదు. ఆ అటుకులు ఇచ్చే వెనకాల ఆ మోటివ్ ఏమిటి అది కృష్ణుడు ఎంజాయ్ చేస్తున్నాడు. కుచేలుడు

అటుకులు ఎంగిలిచేసి ఇవ్వలేదు. శబరి అన్ని పదార్థాలు ఎంగిలిచేసి బాగున్నాయా లేదా అని చూసి రాముడికి ఇచ్చేది, ఆ ఎంగిలి పళ్ళు ఎంత బాగున్నాయో అని రాముడు తినేసేవాడు. రాముడు తినేసి వూరుకోలేదు, శరీరంతోటి ఉండగానే శబరిని ఆయనలో కలిపేసుకున్నాడు, అది శబరి యొక్క వైభవం. ఒకసారి అమెరికాలో స్వామీజీ మాట్లాడుతూ ఉంటే అక్కడివారు ఏమన్నారు అంటే మీ గురువుగారికంటే నీవే గొప్పవాడివయ్యా, మీ గురువుగారికి చదువులేదు, సంధ్య లేదు. సబ్జక్టు నువ్వే బాగా ప్రెజంట్ చేస్తున్నావు అన్నారు. అప్పుడు స్వామీజీ ఏమి అన్నారు అంటే ఏ గురువు అయితే నన్ను తయారుచేసాడో ఆ గురువు కంటే నేను గొప్పవాడిని అని అనకండి అది అపచారం అన్నాడు. మిస్ అండర్‌స్టాండింగ్ వల్ల అలా అనుకుంటున్నారు అని స్వామీజీ అన్నారు. వాసుదేవ స్వామి గీతలో ఏమన్నారు అంటే నువ్వు ఎక్కడ చెయ్యిపెడుతూ ఉంటే అక్కడ నీకు మంచినీళ్ళు దొరికేటప్పుడు నూతులు చుట్టూ, చెరువుల చుట్టూ తిరగటం నీకెందుకు? నీళ్ళు దొరకని వాడు నూతులు చుట్టూ, చెరువుల చుట్టూ తిరుగుతాడు. నీకు కావలసిన ఆనందం, నీకు కావలసిన సుఖం, నీకు కావలసిన శాంతి నీకు అందుతూ ఉంటే ఇంక బయట ఏదో చేస్తే ఏదో వస్తుంది అని తిరగవలసిన పని నీకు లేదు. బ్రాహ్మీస్థితి పొందినవాడికి వాండరింగ్ అవసరం లేదు.

రమణస్వామి చెప్పేది ఏమిటి అంటే అనుగ్రహం లేదు, అనుగ్రహం లేదు అని మీరు అంటున్నారు. అసలు అనుగ్రహం పని చేయని క్షణమంటూ లేదు దయలేని క్షణమంటూ లేదు. కానీ దానిని పట్టుకోలేక అది మనకు అందటం లేదు కాబట్టి లేదు అనుకుంటున్నాము. ప్రేమిస్తే జ్ఞానే ప్రేమించాలి. అజ్ఞానంలో ఉన్నవాడు ఏమి ప్రేమిస్తాడు. జ్ఞానము ప్రేమ వేరుగా ఉండవు, జ్ఞానము ఆనందము వేరుగా ఉండవు. వైభవం అంతా జ్ఞానంలోనే ఉంది. తపస్సు అంటే దేహము నేను అనే తలంపుని ఎండింపచేయటమే తపస్సు. మనకి దేహాభిమానం ఉన్నంతకాలం భగవంతుడు ఏ పని అయితే చెయ్యమన్నాడో ఆ పని చెయ్యాలి, వద్దు అని చెప్పిన పని చెయ్యకూడదు. అప్పుడు మన మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది. నీకు ఒకవేళ బ్రాహ్మీస్థితి కలిగినా యజ్ఞ, దాన, తపస్సులు విడిచిపెట్టవద్దని స్వామివారు చెప్పారు. విడిచిపెట్టవలసినవి ఏమిటి అంటే రాగము, భయము, కోపము అన్నారు స్వామి. నువ్వు సత్‌కర్మ చేస్తూ కర్మయోగి అవ్వాలి కాని, నీ చేతిలో వున్న పని మానేసినంత మాత్రంచేత